


పాడి రైతుల ముంగిటకు పథకాలు

పార్వతీపురం/ బెలగాం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల ముంగిటకు ప్రభుత్వ పథకాలు తీసుకెళ్లి.. వాటిపై అవగాహన కల్పించాలని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి ఎస్.మన్మథరావు ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్రలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ధరను రూ.500 నుంచి రూ.150 తగ్గించామన్నారు. ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు.



ప్రోత్సహిస్తే.. సిరుల పంటే!

- కాఫీ సాగుకు జిల్లా అనుకూలం
- ఇప్పటికే పాచిపెంట, సాలూరు మండలాల్లో తోటల పెంపకం



పాచిపెంట మండలంలో కాఫీ తోట

● దృష్టి సారించని గత వైసీపీ సర్కారు ● రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు ● చొరవ చూపితే.. పెరగనున్న సాగు విస్తీర్ణం

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని కొండ శిఖర ప్రాంతాలు కాఫీ పంట సాగుకు ఎంతో అనుకూలం. తోటల పెంపకానికి గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నా.. ప్రోత్సాహం మాత్రం కొరవడుతోంది. దీంతో వారు పోడు వ్యవసాయం, జీడి తోటలపైనే ఆధారపడాల్సి వస్తోంది. అయితే తెగుళ్లు, గిట్టుబాటు ధర రాక ఏటా నష్టాలను చవి చూస్తున్నారు. మరికొందరు ఉపాధి కోసం వలస బాట పడుతు న్నారు. ఈ నేపథ్యంలో మన్యంలోని గిరిశిఖర గ్రామాల్లో కాఫీ తోటల పెంపకం చేపడితే గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు దృష్టి సారించాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.



ఇదీ పరిస్థితి..

- రాష్ట్ర కాఫీ బోర్డు బృందం 1994లో జిల్లాలో పర్యటించింది. ఈప్రాంత వాతావరణం, శీతోష్ణ పరిస్థితులు కాఫీ తోటల పెంపకానికి అనుకూలంగా ఉన్నాయని నిర్ధారించింది. గుమ్మలక్ష్మీపురం మండలం గోయిపాక, తాడికొండ కొండపై వంగర, కేసర, డోలుకొన తదితర గ్రామాలు, కురుపాం మండలం జరడ తదితర ఆరు పంచాయతీలు, పాచిపెంట మండలంలోని రెండు పంచాయతీలు, సాలూరులోని కొండ శిఖర గ్రామాలు కాఫీ సాగుకు అనువైనవిగా గుర్తించారు. దీనిపై అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే పంట ప్రోత్సాహకానికి పార్వతీపురం ఐటీడీఏకు నిధులు రాలేదు. అప్పటి అధికారులు కాఫీ సాగుకు తగిన ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది.
- పాడేరు, అరకు, చింతపల్లి ప్రాంతాల్లో కాఫీ తోటల పెంపకానికి ఐటీడీఏ అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. పార్వతీపురం ఐటీడీఏపై మాత్రం దృష్టి సారించకపో వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ప్రస్తుతం పాచిపెంట మండలం సతాబి, తంగాలం గిరిశిఖర గ్రామాల్లో సుమారు పది ఎకరాల్లో, సాలూరు మండలం కొఠియా ప్రాంతాల్లోనూ కాఫీ సాగు చేపడుతున్నారు. అయితే మార్కెట్ సౌకర్యం, అధికారుల ప్రోత్సాహం లేకపోవడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో వారు పాడేరు, అనంతగిరికి పంటను తీసుకెళ్లి విక్రయించాల్సి వస్తోంది.
- వాస్తవంగా కాఫీ తోటలు వేసిన మూడేళ్ల తర్వాత పంట చేతికి వస్తుంది. ఎకరాకు 300 కేజీల వరకు

(మిగతా 8వ పేజీలో...)

చిగురిస్తున్న ఆశలు


ఇటీవల కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కొండ శిఖర గ్రామాల్లో కాఫీ తోటల పెంపకానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. దీంతో గిరిజన రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాగును ప్రోత్సహించేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. 'ఇటీవల కలెక్టర్ కాఫీ తోటలపై సమీక్షించారు. త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటాం.' అని మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు తెలిపారు.

జేసీ బదిలీ

- నూతన జాయింట్ కలెక్టర్‌గా యశ్వంత్‌కుమార్ రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ శోభికను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పోస్టింగ్ ఎక్కడన్నది ఖరారు చేయలేదు. జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచించింది. ఇకపోతే నూతన జేసీగా యశ్వంత్‌కుమార్‌రెడ్డిని నియమించింది. కొన్ని రోజుల కిందట వరకు ఆయన పాలకొండ సబ్ కలెక్టర్‌గా, సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా పనిచేశారు. తాజాగా జేసీతో పాటు పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా పనిచేసిన శ్రీవాత్సవను గుంటూరు జిల్లా జేసీగా నియమించారు. కాగా ప్రస్తుతం ఇన్‌చార్జి పీవోగా సబ్ కలెక్టర్ వైశాలి విధులు నిర్వర్తిస్తున్నారు.

సందడిగా వినాయక నిమజ్జనాలు 6లో



ఉత్తమ గురువులు

● రాష్ట్రస్థాయి అవార్డులకు ముగ్గురు టీచర్ల ఎంపిక ● ప్రకటించిన ప్రభుత్వం



యర్రా శంకరరావు



డి. లక్ష్మణరావు



బి. శంకరరావు

పార్వతీపురం/జియ్యమ్మవలస/ పాలకొండ/కొమరాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి జాబితాను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఇందులో జిల్లాకు చెందిన ముగ్గురు టీచర్లు ఉన్నారు. వారికి శుక్రవారం సీఎం చంద్రబాబు అవార్డులు అందించనున్నారు.

- జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి ఎంపీపీ స్కూల్ (బీసీ)లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న యర్రా శంకరరావు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. 2002లో టీచర్‌గా రంగారెడ్డి జిల్లా బుల్కాపూర్‌లో నియమితులయ్యారు. 610 జీవో ప్రకారం జియ్యమ్మవలస మండలం పరజపాడు గ్రామ ఎంపీయూపీఎస్‌కు బదిలీపై వచ్చారు. ఆ తరువాత ఎంపీపీఎస్ (ఆర్) పెదబుడ్డిడికి వచ్చారు. ప్రస్తుతం ఎంపీపీఎస్ (బీసీ)లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఉత్తమమైన విద్యా బోధన, పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దడంలో స్థానిక పెద్దలు, యూత్ సహకారం తీసుకుని ముందుకు సాగారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్‌గా ఎఫ్ ఎల్ఎన్, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు (జోన్-1) ఉపాధ్యాయులకు రోల్ మోడల్‌గా నిలిచారు. మెంటర్‌గా శిక్షణ ఇచ్చేవారు. ఆయన తయారుచేసిన 1, 2 తరగతుల టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) అధికారుల ప్రశంసలు అందుకుంది. 2017లో ఉమ్మడి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అదే ఏడాది మదర్‌థెరిసా ఫౌండేషన్ వారు గురు బ్రహ్మ అవార్డుతో సత్కరించారు.
- పాలకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పనిచేస్తున్న సంస్కృత ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావు మాస్టార్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. దీనిపై పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ఈ అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉందని, తన బాధ్యత మరింత పెరిగిందని శంకరరావు మాస్టారు తెలిపారు. కాగా ఆయన శంకర వచనాలు, జిల్లెళ్లమూడి అమ్మ జీవితచరిత్ర, సన్మాన పత్ర రచన చేశారు. రంగస్థల నటులు కూడా. పాలకొండ సీతంపేట, పార్వతీపురంలో ఉగాది పురస్కారాలను అందుకున్నారు. పాలకొండ పట్టణంలోని సూర్యచంద్ర కళా సాహితీ ఆధ్వర్యంలో తెలుగు భాషా సాహిత్యాల కార్య క్రమాలు నిర్వహిస్తుంటారు. ఇప్పటివరకు సుమారు 600 సన్మానపత్రాలు రాశారు. జిల్లెళ్లమూడి అమ్మ సేవా సమితి ద్వారా పేదలకు అన్నదాన

(మిగతా 8వ పేజీలో...)

ఆదికర్మయోగిపై
యాక్షన్ ప్లాన్

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో స్వప్నిల్ జగన్నాథ్



సీతంపేట రూరల్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆదికర్మయోగి పథకంలో భాగంగా గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలపై యాక్షన్‌ప్లాన్ తయారుచేసుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశించారు. ఈనెల 8 నుంచి 12వరకు అదే పనిలో ఉండాలన్నారు. బుధవారం స్థానిక వైటీసీలో 'ఆదికర్మయోగి'పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలు, వనరులు, గ్రామస్థుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మండల, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏ సమస్య ఉన్నా ఐటీడీఏకు తెలియజేయాలన్నారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఇలానే వదిలేస్తారా?

- నిరుపయోగంగా నీటి తొట్టెలు

గరుగుబిల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో మూగ జీవాలకు ఉపయోగకరంగా ఉంటా యన్న ఉద్దేశంతో జిల్లాలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. చాలాచోట్ల అవి చెత్తాచెదారంతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వాస్తవంగా 15 మండలాల్లో సుమారు 411కు పైగా నీటి తొట్టెలు నిర్మించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి సిబ్బంది ఆదరాబాదరాగా వాటి పనులు పూర్తి చేశారు. అయితే తొట్టెల్లో నీటిని నింపే ప్రయత్నాలు చేయలేదు. ప్రస్తుతం గ్రామాల్లో వినియోగానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం అవి వర్షపు నీటితో నిండాయి. వాటిపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా ఒక్కో నీటి తొట్టె నిర్మాణానికి వేతనంగా రూ. 5,100, సామగ్రికి రూ. 24,100 చొప్పున వెచ్చించారు. గ్రామస్థాయిలో కొందరు కూటమి నేతలే వాటి నిర్మాణాలు చేపట్టారు. అయితే పనులు చేపట్టి ఐదు నెలలు కావస్తున్నా.. వాటి నిధులు ఇంకా మంజూరు కాలేదు. సంబంధిత నీటి తొట్టెలకు కొలతలు వేసి నిధుల కోసం ఎఫ్‌టీయోలు జనరేట్ చేశారు. అయితే అనుమతులు లభించలేదు. వీటితో పాటు 323 ప్రహరీల నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు కాలేదు.



శివ్వాం సచివాలయం ఎదుట చెత్తతో నిండిన నీటి తొట్టె

తొట్టెల నిర్వహణ పంచాయతీలదే..

'ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నీటి తొట్టెల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. తొట్టెల్లో నీరు నింపడం, తదితర నిర్వహణ బాధ్యతలు ఉపాధి క్షేత్ర సహాయకులు, పంచాయతీ సిబ్బందికి అప్పగించాం. వాటిపై దృష్టి సారించాలని ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశాం. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవు. తొట్టెలతో పాటు ప్రహరీలకు సంబంధించి నిధుల విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.' అని సీతంపేట క్లస్టర్ ఉపాధి ఏపీవో జి.శ్రీహరిరావు తెలిపారు.



గరుగుబిల్లిలో..

బస్సుల్లో ఉచిత ప్రయాణానికి స్మార్ట్‌కార్డు
● మహిళలకు అందించేందుకు చర్యలు
● పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం 6లో

గిరిజన విద్యార్థులకు రహదారి కష్టాలు 6లో

వచ్చే నెలలో వంతెన ప్రారంభిస్తాం
● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

గండ్లు పూడ్చేదెప్పుడో? 8లో

ఎరువుల కొరత లేదు

● సమస్యలు తెలిపేందుకు కాల్ సెంటర్ ● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 887 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఇందులో 699 టన్నులు రైతు సేవా కేంద్రాలకు చేరిందని వెల్లడించారు. బుధవారం మార్క్‌ఫెడ్ బఫర్ ద్వారా 22 రైతు సేవా కేంద్రాలకు 252 టన్నుల యూరియాను తరలించినట్టు చెప్పారు. కొమరాడ మండలానికి 30 , సీతంపేట 20, కురుపాం 32, సాలూరు 12 , జీఎల్‌పురం 30, జియ్యమ్మవలస 40, గరుగుబిల్లి 10, సీతానగరం, మక్కువ, బలిజిపేట పార్వతీపురం మండలాలకు 12 టన్నుల చొప్పున పంపినట్టు పేర్కొన్నారు. త్వరలో మరో 2,013 టన్నుల యూరియా జిల్లాకు రానుందని తెలిపారు. ప్రస్తుతం 1341 టన్నుల డీఏపీ, 1332 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 647 టన్నుల పొటాష్, 905 టన్నుల సూపర్‌ఫాస్పెట్ ఎరువులు అందుబాటులో ఉన్నట్టు వివరించారు. ఎరువుల సమస్యలు తెలియజేసేందుకు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు ఈ 94401 04317, 79894 34766 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

రేపటి లోగా ప్రతిపాదనలు పంపాలి

నూతన ఆవిష్కరణాత్మక ప్రాజెక్టులకు ఈ నెల 5లోగా ప్రతిపాదనలు సిద్ధం చేసి నీతి అయోగ్‌కు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. డ్వామా, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ పీడీలు, డీఈవో, డీఎంహెచ్‌వో, వ్యవసాయ శాఖాధికారులు, ఐటీడీఏ పీవోలు ఇందులో భాగస్వాములవ్వాలన్నారు. నోడల్ ఆఫీసర్ మహేష్ పర్యవేక్షిస్తారని, 15న టెక్ హబ్ రేపోజోటోరీ ప్రారంభం కానుందని తెలిపారు.



కొమరాడ : కుంతేసు గెడ్డపై ఉధృతంగా వరద ప్రవాహం

ఏజెన్సీలో జోరువాన

● జిల్లాపై అల్పపీడన ప్రభావం ● ఉప్పొంగుతున్న వాగులు, గెడ్డలు ● నేడూ వర్షం కురిసే అవకాశం

సాలూరు రూరల్/కొమరాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో బుధవారం సాలూరు ఏజెన్సీలో భారీ వర్షం కురిసింది. దక్షిణ ఒడిశా పొట్టంగి బ్లాక్, కొఠియా కొండల్లోనూ జోరువాన పడింది. దీంతో ఒడిశా నుంచి ఏపీకి ప్రవహిస్తున్న వేగావతి, వట్టిగెడ్డ, సువర్ణముఖి, గోముఖి నదులు ఉప్పొంగి ప్రవహించాయి. గిరిజన ప్రాంతాల్లో వాగులకు వరద పోటెత్తుతోంది. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి ఉబాలు పనుల్లో నిమగ్నమయ్యారు. కొమరాడ మండలంలోని మారు మూల ఏజెన్సీ గ్రామమైన కుంతేసులో గెడ్డపై అధికంగా వరద నీరు ప్రవహించింది. దీంతో సుమారు ఎనిమిది గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపో యాయి. కుంతేసు, గొరైలమ్మ, జొప్పంగి, వానబడి, దర్భంగి తదితర గ్రామాల ప్రజలతో పాటు ఒడిశా రాష్ట్రం కొమ్ము గండ గిరిజనులు పార్వతీపురం మీదుగా ఈ గెడ్డ దాటి కొమరాడ రావాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థి తుల నేపథ్యంలో వారు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. కాగా అల్పపీడన ప్రభావంతో గురు వారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. జిల్లాకు ఎల్లో అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎవరూ నదులు, చెరువులు, వాగుల్లో దిగరాదని సూచించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు ఎప్పటికప్పుడు సమాచారమందించాలని ఆదేశించారు.



దండిగాం వద్ద సువర్ణముఖి నది ఇలా..

శుద్ధ నీరు సురక్షితమేనా?



- జిల్లాలో ఇష్టారాజ్యంగా ఆర్వో ప్లాంట్లు
- అనుమతులున్నవి కొన్నే..

రాజాం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్షాలు పడుతున్నాయి. వ్యాధులు ముసురుతున్నాయి. అయితే వీటికి కారణం జల, వాయు కాలుష్యమే. ముఖ్యంగా ఈ కాలంలో జ్వరాలతో పాటు డయేరియా ప్రబలుతుంది. గత ఏడాది జిల్లాను డయేరియా వణికించింది. అయినా సరే దానినుంచి యంత్రాంగ పాఠాలు నేర్వలేదు. ఇప్పటికీ అదే నిర్లక్ష్యం కొనసాగుతోంది. తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ లేకపోగా కలుషితమవుతోంది. పంచాయతీలు, మునిసిపాల్టీలు, నగరపాలక సంస్థలు అందిస్తున్న నీటి నాణ్యతపై అను మానాలుండడంతో ఎక్కువమంది శుద్ధ జలాల ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. అక్కడ కూడా నాణ్యతకు, నిబంధన లకు పాతర వేయడంతో తాగునీరు రూపంలో ప్రజలు అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు.

అనుమతిలేనివే ఎక్కువ..

ఉమ్మడి జిల్లాల్లో పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం 327 ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వాటిలో కొన్ని మాత్రమే అన్నిరకాల అనుమతులు తీసుకున్నట్టు తెలుస్తోంది. అరకొర అనుమతులతోనే ఎక్కువగా నడిపిస్తున్నట్టు సమాచారం. సాధారణ కుళాయి నీటినే క్యాన్లలో పెట్టి విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. విజయనగరం నగరపాలక సంస్థలో 83 వరకు ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో 50 వరకు అనుమతులు ఉన్నట్టు తెలుస్తోంది. సాధారణంగా ప్లాంట్ వద్ద 20 లీటర్ల నీటిని రూ.20 వరకు విక్రయిస్తున్నారు. అదే ఇంటి వద్దకు తెస్తే రూ.30కి అమ్ముతున్నారు. సుదూర ప్రాంతాలు, అపార్ట్‌మెంట్లలోకి అయితే రూ.50కి విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక సీసాలు, ప్యాకెట్ల రూపంలో అమ్ముడవుతున్నవి లెక్కే లేదు. ప్రస్తుతం మద్యం దుకాణాల వద్ద ఊరూ పేరూ తెలియని వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు విక్రయిస్తున్నారు. అయితే అవి సురక్షితమా? కాదా? అన్నది తెలియదు.

చాలారకాల రుగ్మతలు..

కలుషితమైన నీటిని తాగితే చాలా రకాల రుగ్మతలు దరిచేరుతాయి. వాటి విషయంలో చాలా జాగ్రత్తలు అవసరం. ఆర్వో ప్లాంట్లలో నిబంధనలు పాటించకపోవడంతో ఆ నీటిని తాగుతున్న వారు ఇబ్బందులు తెచ్చుకుంటున్నారు. అందుకే ఆర్వో ప్లాంట్ల నీరు సురక్షితమా? కాదా? అన్న విషయాన్ని గుర్తెరగాలి.

- వైద్యుడు, రాజాం



నాటి దూకుడేదీ?

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తొలి రోజుల్లో బీఆర్ అంబేడ్కర్ కొరడా ఝుళిపించారు. అనధికార, అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లపై చర్యలకు ఆదేశించారు. దీంతో అప్పట్లో రెవెన్యూ అధికారులు చర్యలకు దిగారు. కాలక్రమంలో వాటర్ ప్లాంట్లు మళ్లీ వెలిశాయి. యథేచ్ఛగా వ్యాపారం చేసుకుంటున్నాయి. వాస్తవానికి ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు 11 రకాల అనుమతులు తప్పనిసరి. తాజాగా కాలుష్య నియంత్రణ మండలి అనుమతిని సైతం తప్పనిసరి చేశారు. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్ఐ) ధ్రువీకరణ తప్పనిసరి. జల పరీక్షలు చేయించాలి. ఆహార కల్తీశాఖ నుంచి లైసెన్స్ తీసుకోవాలి. పంచాయతీ, మునిసిపాల్టీల నుంచి ఎన్‌వోసీ పొందాలి. తూనికలు కొలతల శాఖ నుంచి ప్యాకింగ్‌కు, పరిశ్రమలు, కార్మిక శాఖ నుంచి విధిగా అనుమతులు పొందాలి. లావాదేవీలకు ఎస్‌జీటీ ఉండాలి. కానీ ఇవేవీ జిల్లాల్లో ప్లాంట్ల అనుమతుల్లో కానరావడం లేదు. ఒకటి రెండు అనుమతులు తీసుకుని వ్యాపారం మొదలు పెడుతున్నారు. ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పెడుతు న్నారు. రోజుల తరబడి నిల్వ ఉంచి నీటిని అమ్మి ప్రజలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

సిరిమానోత్సవం వైభవంగా నిర్వహించండి

- ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అదితి



సిరిమానోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఈవో శిరీష, ఆలయ అర్చకులు,సిబ్బంది

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, సిరులతల్లి పైడిమాంబ సిరిమానోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. బుధవారం చదురుగుడి వద్ద సిరిమానోత్సవ ప్రచార రథానికి పూజలు చేసి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ, లక్షలాది మంది భక్తులు సిరిమానోత్సవానికి తరలిరానున్న నేపథ్యంలో దేవదాయ శాఖ పరంగా కూడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సిరిమానోత్సవాలపై ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేయాలని సూచించారు.

ప్రత్యేక పూజలు

ప్రచార రథం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం పైడిమాంబ చదురుగుడికి వచ్చిన అదితి గజపతిరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకి ఆలయ ఈఓ శిరీష, సూపరింటెండెంట్ ఏడుకొండలు తదితరులు స్వాగతం పలికారు. ప్రసాదాన్ని, పైడిమాంబ చిత్రపటాన్ని ఆమెకు ఆలయ ఈఓ అందజేశారు. అనంతరం సిరిమానోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఈఓ శిరీష, పైడిమాంబ భక్తబృందం, ఆలయ అర్చకులు, సిబ్బంది ఆవిష్కరించారు.

భూములు వెనక్కి ఇచ్చేయండి

- జిందాల్ నిర్వాసితుల డిమాండ్

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'జిందాల్ కోసం మా నుంచి భూములు సేకరించారు. 18 ఏళ్లగా పరిశ్రమ రానప్పుడు ఈ సభలు ఎందుకు? మా భూములు వెనక్కి ఇచ్చేయండి' అంటూ కిల్తంపాలెం పంచాయతీ కొత్త అడ్డతీగకు చెందిన ఊలం పార్వతి అనే గిరిజన మహిళ డిప్యూటీ కలెక్టర్ మురళిని కోరింది. దీనిపై ఆయన స్పందిస్తూ.. దీనిపై అర్జీ ఇవ్వాలని కోరారు. ఆయన ఆధ్వర్యంలో బొడ్డవర సచివాలయంలో బుధవారం ఉదయం జిందాల్ నిర్వాసితులతో గ్రామసభ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో నిర్వాసితులు అక్కడికి చేరుకున్నారు. తమకు నష్ట పరిహారం రాలేదని... జిందాల్ సంస్థ షేర్లలో ఏటా లాభాలు ఇస్తామని అప్పట్లో చెప్పారని అనేకమంది తెలిపారు. భూ సేకరణలో లేని సర్వే నెంబర్లలోని స్థలాలను అక్రమంగా స్వాధీనం చేసుకొని తమను బెదిరించి పంపేశారని బందవలస, తదితర గ్రామాల ప్రజలు తెలిపారు. భూములు వెనక్కి ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఇతరులు తమ పరిహారాన్ని కాజేశారని కొందరు ఆరోపించారు. నిర్వాసితులు తెలిపిన అంశాలను తహశీల్దార్ శ్రీనువాసరావు, జిందాల్ ప్రతినిధులు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ హడావుడిగా సభ పెట్టడం వల్ల చాలా మంది నిర్వాసితులు రాలేకపోయారని... కనీసం గ్రామాల్లో దండోరా వేయించాల్సిందని అన్నారు. దీనిపై డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఇది నిరంతర ప్రక్రియ అని.. దీనిని కొనసాగిస్తామన్నారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా నిర్వాసితులు దరఖాస్తులు ఇచ్చేందుకు తరలివచ్చారు. సాయంత్ర ఐదు గంటల వరకు సుమారు 200 వినతులు వచ్చాయి. చీకటి పడినా వినతులు స్వీకరించి..వెళతామని అధికారులు తెలిపారు.



అధికారులకు సమస్యను వివరిస్తున్న పార్వతి

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ అంధకారమే

- ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ తదితర కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీనియర్ విద్యార్థులు, తోటి విద్యార్థుల పట్ల శ్రుతి మించి ప్రవర్తిస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాగింగ్‌ను నియంత్రించేందుకు కళాశాల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని సూచించారు. ర్యాగింగ్‌ని నియంత్రించేందుకు కళాశాలలో హెల్ప్‌లైన్ నెంబర్లను, పోస్టర్‌లను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడితే రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. అంతేకాకుండా ఉన్నత విద్యావకాశాలు కోల్పోతారని ఎస్పీ వివరించారు.



స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు విడుదల చేసిన వరద ప్రవాహం

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధికంగా వరద నీరు నదిలో వచ్చి చేరుతోంది. బుధవారం ఎగువ నుంచి 5 వేల క్యూసెక్కుల మేర వరద నదిలోకి చేరింది. ప్రాజెక్టు అధికారులు వరద ప్రవాహాన్ని స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు మళ్లించే చర్యలు చేపట్టారు. గేట్ల నుంచి దిగువకు 3,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 1,270 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గానూ 104.28 మీటర్ల నీటి నిల్వ ఉంది.

వచ్చే నెలలో వంతెనను ప్రారంభిస్తాం

- ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సువర్ణముఖి నదిపై నిర్మిస్తున్న వంతెనను అక్టోబరులో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సువర్ణముఖి నదిపై నిర్మిస్తున్న వంతెన పనులు శరవేగంగా చేపట్టాలని ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. దీంతో పాటు బూర్జలో సువర్ణముఖి నదిపై వంతెన పనులకు సుమారు రూ. 6 కోట్లు అంచనా లు రూపొందించామన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల మాట నిలబెట్టుకుంటోందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో బీటీ రోడ్లకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. జోగింపేట నుంచి పాపమ్మవలస, కోట సీతారాంపురం నుంచి జానుమునివలస, చెల్లంనాయుడువలస నుంచి వెంకటాపురం, కృష్ణరాయపురం నుంచి నిడగళ్లు, చినభోగిలి నుంచి బక్కుపేటకు బీటీ రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు గోపాల్‌నాయుడు, సాల హరిగోపాలరావు, కంకనాపల్లి అరవింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

గణేష్ లడ్డూ రూ.20,500



గణేష్ లడ్డూ వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

కురుపాం రూరల్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మొండెంఖల్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామికి నివేదించిన లడ్డూ ప్రసాదానికి మంగళవారం రాత్రి నిర్వా హకులు వేలం పాటను నిర్వహించారు. వే లం పాటలో వినాయక లడ్డూను రూ.20,500 లకు సాకి అప్పన్న దక్కించుకున్నారు. గణేషుడికి వేసిన కరెన్సీ నోట్ల దండను దీసరి గౌరీకుమారి రూ.51,500లకు వేలం పాటలో కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంటికుప్పల గౌరీ శంకరరావు, కుమ్మరి నీలమ్మ, ఐ.రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వినాయక నిమజ్జనాలు

వీరఘట్టం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాల సందడి బుధవారం నెలకొంది. వీరఘట్టం చాకలివీధికి చెందిన వినాయకుడి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. యువకులు డ్యాన్స్‌లతో సందడి చేశారు. కూరాకులవీధి శ్రీకృష్ణసేవా సంఘం ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు.



వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



బురదలో నడుస్తూ బట్టివలస గిరిజన గ్రామం నుంచి గోపాలరాయుడుపేట పాఠశాలకు వస్తున్న విద్యార్థుల దృశ్యం

గిరిజన విద్యార్థులకు రహదారి కష్టాలు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలం బట్టివలస గిరిజన గ్రామ విద్యార్థుల ఇక్కట్లు ఇవి. వీరు చదువుకోవాలంటే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపాలరాయుడుపేటకు రావాల్సిందే. రోడ్డు సరిగా లేకపోవడంతో వీఆర్ఎస్ కాలువ, పొలంగట్ల పైనుంచి వెళ్లాల్సిన దుస్థితి. వర్షం పడితే గట్లు బురదమయంగా మారడంతో విద్యారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురదలో జారుతూ పడుతూ లేస్తూ పాఠశాలకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి రహదారికి తాత్కాలిక మరమ్మతులు అయినా చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బస్సుల్లో ఉచిత ప్రయాణానికి స్మార్ట్ కార్డు



- మహిళలకు అందించేందుకు చర్యలు
- పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

పాలకొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గతనెల 15 నుంచి స్త్రీశక్తి పథకం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. అయితే ఇకపై వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు అందించనుంది. ఈ మేరకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులో మహిళలు ఆధార్ కార్డు చూపిస్తే జీరో ఫెయిర్ టికెట్ అందిస్తున్నారు. ఓటరు, రేషన్‌కార్డుల్లో ఏది చూపించినా ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించే వీలు కల్పించడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం పాలకొండ, సాలూరు, పార్వతీపురం డిపోల పరిధిలో రోజుకు సరాసరి 92 వేల మంది ప్రయాణి స్తున్నారు. వారిలో మహిళా ప్రయాణికులు 40 వేల మందికి పైగా ఉన్నారు. భవిష్యత్‌లో వారి సంఖ్య మరింత పెరగనుందని ఆర్టీసీ వర్గాలు తెలియజేస్తున్నాయి. కాగా కొంతమంది నిరక్షరాస్యులు అవగాహన లేక గుర్తింపు కార్డులను తెచ్చుకోవడం లేదు. మరికొందరు గతంలో బ్యాంకు జీరో ఖాతాల కోసం పొందిన కార్డులను చూపిస్తున్నారు. వాటిని పరిగణనలోకి తీసుకోకపోవడంతో చార్జీ చెల్లించి టికెట్ తీసుకోవాల్సి వస్తోంది. ఇటువంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డుల పంపిణీకి సర్వం సిద్ధం చేస్తోంది. త్వరలోనే ఈ కార్డులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి ఇటీవల ప్రకటించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 'జిల్లాలోని మూడు డిపోల పరిధిలో 237 బస్సులు తిరుగుతున్నాయి. వాటిల్లో 187 ఫ్రీ సర్వీసులు అందిస్తున్నాయి. స్మార్ట్‌కార్డులపై విధివిధానాలు ఇంకా రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే తెలియజేస్తాం.' అని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.



బస్సు ఎక్కుతున్న మహిళలు



రావుపల్లి బస్టాండ్ ఆవరణలో బస్సు ఎక్కేందుకు క్యూ కట్టిన మహిళలు

బారులుదీరి..

గరుగుబిల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో గ్రామాల్లోని బస్టాండ్స్ మహిళలతో కిటకిటలాడుతున్నాయి. బుధవారం రావుపల్లిలో బస్సు కోసం మహిళలు బారులుదీరారు. పార్వ తీపురం నుంచి వంగర, వంగర నుంచి పార్వతీపురం, పెద్దింపేట, గరుగుబిల్లితో పాటు పలు గ్రామాలకు వెళ్లేందుకు అధికంగా మహిళలు ప్రయాణాలు చేస్తున్నారు. గతంలో అధికంగా ఆటోల్లో ప్రయాణించే మహిళలు ప్రస్తుతం ఉచిత బస్సు కావడంతో బస్సులకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాలపురం సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం అయిదు గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏఈ కుమార్ తెలిపారు. బొబ్బిలి రోడ్డు, చీపురుపల్లి రోడ్డు, కంచరాం, ఆగూరు, అమరాం, దోసరి, గడిముడిదాం, ఒమ్మి, నరసింహపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొత్తవలస, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల కృష్ణ తెలిపారు. బుధవారం తుమ్మికాల్లి పంచాయతీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి శారీరక, మానసిక శ్రమను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కామేశ్వరి, పద్మావతి, ఎల్.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సాయి భజన మండలికి ప్రశంసలు

రేగిడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేగిడి సత్యసాయి భజన మండలికి విశాఖ శంకర్ ఫౌండేషన్ పురస్కారాన్ని అందించింది. దీని ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో నేత్ర వైద్యశిబిరాలు నిర్వహించి దాదాపు వెయ్యి మందికి వైద్య సాయం అందించారు. ఈమేరకు విశాఖలోని సంస్థ కార్యాలయంలో జనరల్ మేనేజర్ రాధాకృష్ణ జ్ఞాపికను అందించినట్టు స్థానిక సత్యసాయి సేవాకమిటీ ప్రతినిధి మామిడి శివకుమార్ తెలిపారు.

సమాచార శాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీగా గోవింద రాజులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

జడ్పీ సీఈవో సందర్శన

నెల్లిమర్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ బుధవారం సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, ఏవో పి.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ కార్యదర్శుల నియామకం

విజయనగరం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ కార్యదర్శులుగా జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మి ఎంపికయ్యారు. విజయవాడలో ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలో వీరిద్దరినీ ఎంపిక చేశారు. వీరిని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటనాయుడు, జి.లక్ష్మణరావు అభినందించారు.

సచివాలయాల తనిఖీ

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 33, 48, 49 సచివాలయాలను నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 34వ సచివాలయంలో పన్ను పరిధిలోకి రాని ఆస్తి వివరాలు, అదనపు నిర్మాణాలపై పన్ను విధింపు ఏ విధంగా చేపడుతున్నారో గమనించారు. 48, 49 సచివాలయాల పరిధిలో దీర్ఘకాలికంగా నీటి చార్జీలు బకాయి ఉన్న కుళాయి కనెక్షన్లు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఆర్‌ఐలు వినోద్, సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చీపురుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం అందజేశారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కెంగువ ధనుంజయ్, తాడ్డి చంద్రశేఖర్, కోట్ల మోతీలాల్‌నాయుడు, కిరణ్‌కుమార్, దాసరి శివప్రసాద్, సారేపాక సురేష్, పి.బలరాం, మహంతి అప్పలనాయుడు, మోపాడ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మాటలను జనం విశ్వసించరు: ఎంపీ


మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రాజాం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలనే ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. బుధవారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు రాజాం వచ్చిన ఆయన టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అప్పుల ఊబిలోకి నెట్టారని... దానిని అధిగమించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అటు కేంద్రంతో, రాష్ట్రంలో కూటమి నాయకులతో సమన్వయం చేసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అటువంటి నాయకుడిని విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రను అన్ని రంగాలలో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి చేశారో చెప్పేసత్తా ఆ పార్టీ నాయకులకు లేదని కలిశెట్టి విమర్శించారు. చీపురుపల్లి వంతెన పనులు సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గురవాన నారాయణరావు, పిల్లా సత్యంనాయుడు, నాగళ్ల అప్పలనాయుడు, టంకాల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గురజాడ గృహాన్ని ఆధునికీకరించాలి


గురజాడ గృహం వద్ద శాంతి దీక్ష చేస్తున్న బాబ్జీ తదితరులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తి మహాకవి గురజాడ గృహాన్ని ఆధునికీకరించాలని, ఆయన సాహిత్యాన్ని ప్రభుత్వం కాపాడాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ కోరారు. ఈమేరకు బుధవారం గురజాడ గృహంలో శాంతి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రచనల ద్వారా సామాజిక చైతన్యం కలిగించిన గురజాడ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ఈ నెల 4న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోవాలని కోరుతూ శాంతిదీక్ష చేపట్టినట్టు తెలిపారు. చరిత్ర కలిగిన గురజాడ అప్పారావు గృహాన్ని కాపాడడంతో సాంస్కృతిక, పురావస్తుశాఖలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ప్రభాకరరావు, రామ్మోహనరావు, దవళ కొండబాబు, కాపుగంటి ప్రకాష్, ఇందిరా లలిత, పాండ్రంకి వెంకట రమణ, దవళ సర్వేశ్వరరావు, డాక్టరు జక్కు రామకృష్ణ, నాలుగెస్సల రాజు తదితరులు దీక్షకు మద్దతు పలికారు.

గడువు దాటిన 'బాదం మిల్క్'


నిర్వాహకులతో మాట్లాడుతున్న డాక్టర్ సాంబమూర్తి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గూడ్స్ షెడ్ ప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బాదం మిల్క్ కేంద్రాలలో నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిర్వాహకులకు అపరాధ రుసుం విధించారు. పరిశుభ్రత పాటించకుండా... కాల పరిమితి దాటిన పాలతో బాదంమిల్క్ తయారు చేస్తున్నట్టు గుర్తించారు. కాలం దాటిన పాలను బయట పారబోయించారు. నగరంలో ఇటువంటి అనధికార కేంద్రాలు ఎన్ని ఉన్నాయనే దానిపై ఆరా తీస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి బృందం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. బాదం మిల్క్ కేంద్రాల యాజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు.

వెదుళ్లవలసలో షిఫ్ట్ ఆపరేటర్ల ఆందోళన


గ్రామ పెద్దలు, ఏఈతో చర్చిస్తున్న ఎస్‌ఐ

గరివిడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వెదుళ్లవలస విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద షిఫ్ట్ ఆపరేటర్లు బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో సబ్ స్టేషన్‌ను నిర్మించారు. ఆ సమయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను ఇక్కడ నియమించారు. గత 18 నెలలుగా జీతాలు లేనప్పటికీ విధులు నిర్వహిస్తున్నామని వారు చెబుతున్నారు. తాజాగా ఈ సబ్ స్టేషన్‌లో మరో ఇద్దరిని షిఫ్ట్ ఆపరేటర్లుగా కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. వారు విధులకు హాజరయ్యేందుకు బుధవారం ఉదయం సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీనిపై తమను అన్యాయంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న ఆపరేటర్లు కుటుంబాలు, గ్రామ పెద్దలతో కలసి సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ధర్నా చేశారు. దీంతో ఉద్రికత్తత చోటుచేసుకుంది. ఇంతలో ఎస్‌ఐ లోకేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలతో చర్చలు జరిపారు. గరివిడి ఏఈ సన్యాసినాయుడు అక్కడికి వచ్చి వివరణ ఇవ్వడానికి ప్రయత్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తగా ఇద్దరు వ్యక్తులను నియమించామని... పాతవారిని కొనసాగించాలా లేదా అనే విషయమై తనకు స్పష్టత లేదన్నారు. దీంతో సర్పంచ్ తమ్మినాయుడు తదితరులు మాట్లాడుతూ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు వచ్చి వివరణ ఇచ్చేంత వరకు కొత్తవారిని లోపలికి పంపించేది లేదని పట్టుబట్టారు. దీంతో కొత్తవారు కూడా విధులకు హాజరుకాలేదు. చివరగా ఏఈతో ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేయాలని సూచించడంతో వివాదం సద్దుమణిగింది.

దావోస్‌కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఈ నెల 5 వరకు జరుగనున్న గ్లోబల్ ఎస్ఎంఈ సదస్సులో పాల్గొనడానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పయనమయ్యారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు మంత్రి వివిధ సంస్థలతో సంప్రదించనున్నారు. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధికి అవసరమైన చర్చలలో ఆయన పాల్గొంటారు.

గురవాం యువకుడిపై పీడీ యాక్ట్

రాజాం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజాం మండలం గురవాం గ్రామానికి చెందిన కుప్పిలి నవీన్‌ను నివారణ నిర్బంధ చట్టం (పీడీ యాక్ట్) కింద నిర్బంధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ అంబేడ్కర్ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం ఆమోదించింది. కుప్పిలి నవీన్ ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తూ చిన్న చిన్న విషయాలకే గొడవలకు దిగుతూ... హాని కలిగించడం, శారీరక దాడులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడుతున్న విషయమై రాజాం టౌన్ సి.ఐ. అశోక్‌కుమార్... కలెక్టర్, ఎస్పీలకు నివేదించారు. సంఘ విద్రోహక శక్తిగా ప్రజల మనసుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాడని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాడని కలెక్టర్‌కు నివేదించారు. దీంతో స్పందించిన కలెక్టర్ అంబేడ్కర్ కుప్పిలి నవీన్ వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. నవీన్‌పై హత్యాయత్నం కేసులో సాక్షులు ఉన్నప్పటికీ భయంతో ముందుకు రావడం లేదని అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రివెన్షివ్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ యాక్ట్ 1986 ప్రకారం ప్రభుత్వం నవీన్‌ను గూండాగా గుర్తించింది. ఈ చట్టం కింద నవీన్‌ను నిర్బంధించడానికి తగు కారణాలున్నాయని అడ్వైజరీ బోర్డు ఏకగ్రీవంగా ఆమోదించింది. పౌర చట్టాలు, నవీన్ నేరపూరిత కార్యకలాపాలను అరికట్టలేకపోయామని ప్రభుత్వం సంతృప్తి చెంది పీడీ యాక్ట్‌కు అనుమతించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయాన్ని రాజాం టౌన్ సి.ఐ. అశోక్‌కుమార్ వద్ద ప్రస్తావించగా వాస్తవమేనని నిర్ధారించారు.

విగ్రహావిష్కరణకు ఆహ్వానం


స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిసిన నాయకులు

గంట్యాడ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేయనున్న జీబీ అప్పారావు విగ్రహావిష్కరణకు రావాలంటూ మండల టీడీపీ నాయకులు తదితరులు బుధవారం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడును ఆహ్వానించారు. ఈమేరకు విశాఖపట్టణంలోని గవర్నర్ బంగ్లాలో బుధవారం ఆయనను కలిశారు. ఈ కార్యక్రమంలో తాటిపూడి ఆయకట్టు చైర్మన్ జగన్నాథం, మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లు విజయకుమార్, నాయకులు రంధి చినరామునాయుడు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

విజయనగరం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళలు సమగ్ర అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీపై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీపీవో డి.వి.మల్లికార్జునరావు, నాగరాజు, అవనాపు దేవుడు పాల్గొన్నారు.

నూతన విధానాలతో అధిక దిగుబడులు

డెంకాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన విధానాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని విజయనగరం ఏడీఏ నాగభూషణరావు తెలిపారు. బుధవారం పినతాడివాడ గ్రామంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మా) సౌజన్యంతో పల్లె భాస్కరరావు పొలంలో డ్రోన్ ద్వారా నానో యూరియాను పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో టి.సంగీత, సర్పంచ్ లంక లక్ష్మణరావు, వ్యవసాయ సహాయకులు జి.రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని చేపడుతున్నామని విద్యార్థులంతా హాజరై జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేష్‌లు పిలుపునిచ్చారు. బుధవారం ఎల్‌బీజీ భవనంలో 'చలో విజయవాడ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రవికుమార్, చినబాబు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు

గరివిడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కావడం, ర్యాగింగ్ వంటి వికృత చేష్టలు మానుకోవాలని ఆర్డీవో పి.ఆశయ్య అన్నారు. అజంతీ సెయింట్ థెరీసా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం ప్రిన్సిపాల్ జె.బాలభాస్కర్ అధ్యక్షతన ర్యాగింగ్ నివారణ, మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాఘవులు, తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

9న రైతుల సమస్యలపై నిరసన

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో, జిల్లాలో నెలకొన్న రైతుల సమస్యలపై ఈ నెల 9న వైసీపీ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ల స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతుల సమస్యలపె ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు వర్రి నర్సింహమూర్తి, కేవీ సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీకి ఆటంకం

రాజాం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సర్వర్ పని చేయకపోవడంతో మంగళవారం సాయంత్రం నుంచి రేషన్ పంపిణీ నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది గంటల తరబడి రేషన్ షాపుల వద్ద నిరీక్షిస్తున్నారు. దీనిపై సీఎస్‌డీటీ చిరంజీవి వద్ద ప్రస్తావించగా...విషయాన్ని డీలర్లు తన దృష్టికి తెచ్చారని, ఉన్నతాధికారులకు సమాచారం అందించామని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

బొండపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ డి.సింహాచలం, హెచ్‌సీ ఎ.కామేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. కెరటాం గ్రామంలోని విజయసాయి ఎంటర్‌ప్రైజస్‌లో రికార్డులు, నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం దేవుపల్లిని శ్రీరాజరాజేశ్వరి ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏవో మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వాహనం ఢీకొని యువకుడి మృతి


సురేష్ మృతదేహం

నెల్లిమర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల రైల్వే ఫ్లై ఓవర్‌పైన బొలెరో వాహనం ఢీకొని దాసరి సురేష్ (27) మృతిచెందాడు. బుధవారం సాయంత్రం గరివిడి నుంచి వస్తున్న వాహనం విజయనగరం నుంచి నెల్లిమర్ల స్కూటీపై వెళుతున్న సురేష్‌ను ఢీకొనడంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఆయనను విజయనగరం ఆసుపత్రికి తరలిస్తుండగా... మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి స్వగ్రామం గుర్ల మండలం గిరిడి. నెల్లిమర్ల ఎస్‌ఐ గణేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి హత్యపై డీఎస్పీ దర్యాప్తు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యరెడ్డి

గజపతినగరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తబగ్గాం గ్రామంలో మంగళవారం రాత్రి పసుపురెడ్డి శ్రీను హత్యకు గురైన సంఘటనకు సంబంధించి మృతుడి భార్య పసుపురెడ్డి జ్యోతి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలివీ.. పిల్లలకు నూడిల్స్ తీసుకువస్తానని శ్రీను తన భార్య జ్యోతి వద్ద రూ.300 తీసుకొని బయటకు వెళ్లాడు. శ్రీను, అతని సోదరుడు చంటి కలిసి కొనిస గ్రామం నుంచి ఒకే బైక్‌పై బయలుదేరారు. శ్రీనును చంపాలని ఎదురుచూస్తున్న చాకలి రామచంద్రుడు బగ్గాం గ్రామ సమీపంలో బైక్‌ను అడ్డగించాడు. దీంతో చంటితో పాటు అతని భార్య సత్యవతి శ్రీనును కత్తితో పొడిచి హత్య చేశారు. అదే సమయంలో అటువైపు వెళుతున్న గోకా బాషా అనే వ్యక్తి జ్యోతికి సంఘటన గురించి తెలిపాడు. దీంతో ఆమె హుటాహుటిన అక్కడికి చేరుకునేసరికే భర్త ప్రాణాలు కోల్పోయాడు. చంటి భార్య ఏదో వస్తువును దాచుకొని వెళుతుండడం చూశానని జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ భవ్య రెడ్డి గ్రామంలో ని మృతుడి ఇంటితో పాటు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాలువ పక్కన ఉన్న రక్తపు మరకలను గుర్తించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఆమె వెంట సీఐ రమణ, ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నాయుడు, వీఆర్వో వెంకన్న, నడుపూరు కమల, మహిళా పోలీస్ కవిత తదితరులు ఉన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

విజయనగరం క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్సార్ నగర్ శివార్లలో బుధవారం పేకాట శిబిరంపై టూటౌన్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17,595 నగదుతో పాటు, 8 సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

నెల్లిమర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్వాసి తుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాన ని డిప్యూటీ కలెక్టర్ మేరీగాంధీ అన్నా రు. తారకరామ ప్రాజెక్టు కింద భూములు కోల్పో యిన నిర్వాసితులతో బొబ్బిలి డిప్యూటీ కలెక్టర్ మేరీగాంధీ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. తమ భూములకు రావాల్సిన బకాయిలను ప్రస్తుత ప్రభుత్వ రేట్లకు అనుగుణంగా చెల్లించాలని నిర్వాసితులు డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. దీనిపై డిప్యూటీ కలెక్టర్ స్పందిస్తూ తారకరామ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తానని, భూములు కోల్పోయిన రైతులకు రావాల్సిన బకాయిలపై అధికారులతో చర్చిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దాసరి కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం


రత్నాజీని అభినందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల దంపతులు

శృంగవరపుకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దాసరి కార్పొరేషన్ చైర్మన్‌గా కొత్తవలస మండలం మునగపాకవానిపాలేనికి చెందిన పొట్నూరు వెంకట రత్నాజీ బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. బీసీ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి.ఉమా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీఅప్పలరామ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మల్లునాయుడు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీను పాల్గొన్నారు.

వెల్‌నెస్ కేంద్రాన్ని ఖాళీ చేయించిన అధికారులు

లక్కవరపుకోట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగుబూడి వెల్‌నెస్ కేంద్రంలో నివాసం ఉంటున్న వారిని ఎట్టకేలకు పీహెచ్‌సీ వైద్యాధికారులు బుధవారం ఖాళీ చేయించారు. ప్రభుత్వ భవనాల్లో 'మేకల ఆవాసం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో జూలై 31న కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో ఎల్.కోట పీహెచ్‌సీ ప్రధాన వైద్యులు బి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించారు. అందులో అదే గ్రామానికి చెందిన ఒక కుటుంబం నివాసం ఉంటోందని...వారి మేకల అందులో ఉంచినట్లు గమనించి వెంటనే ఖాళీ చేయించారు. ప్లంబింగ్, టైల్స్‌వర్క్స్, విద్యుత్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్లనే ప్రారంభం కాలేదని తెలిపారు.

ప్రోత్సహిస్తే.. సిరుల పంటే!

(5వ పేజీ తరువాయి)

దిగుబడి వస్తుంది. ఏడాదికి రూ.లక్ష పైనే ఆదాయం వస్తుందని గిరిజన రైతులు చెబుతున్నారు. ● జీసీసీ ఆధ్వర్యంలో పంటను కొనుగోలు చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది. సబ్సిడీపై పరికరాలు, గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటనలకే పరిమితమైంది. దీంతో గిరిజన రైతులంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. 'మన్యంలో కాఫీ తోటల పెంపకానికి ఐటీడీఏ, కాఫీబోర్డు వారు ప్రోత్సహించాలి. కాఫీ విత్తనాలు, ఎరువులు, సాగు పరికరాలు ఉచితంగా పంపిణీ చేయాలి. గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం కల్పించాలి.' అని రైతులు కోరుతున్నారు.

ఉత్తమ గురువులు

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాలు చేస్తున్నారు. సంస్కృతం, తెలుగును విద్యార్థులకి నేర్పేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. పాలకొండలో పదేళ్లు, టెక్కలిలో 8 సంవత్సరాలు ఆయన పనిచేశారు.● కొమరాడ ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాల హెచ్‌ఎం డి.లక్ష్మణరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సొంతం చేసుకున్నారు. 1992లో గురుకుల పాఠ శాల వమరవల్లిలో గణిత ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు. పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్‌గా, ప్రధానాచార్యులుగా పనిచేస్తూ.. విద్యార్థుల సర్వతోముఖాభి వృద్ధికి అంకితభావంతో కృషి చేశారు. ఇప్పటికే మన్యం, విశాఖ జిల్లాల కలెక్టర్లు, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోతో పలుమార్లు ఆయన ప్రశంసలు అందు కున్నారు. గిరిజన విద్యార్థుల్లో ఉండే నైపుణ్యాన్ని మెరుగుదిద్ది ఆర్ట్, క్రాఫ్ట్‌లో ప్రోత్సహించి స్టాల్స్ ఏర్పాటు చేయించారు. ఐటీ, ఎన్ఐటీ, వంటి జాతీయ విద్యా సంస్థలు, నీట్ ద్వారా మెడికల్ కాలేజ్‌కు ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చారు. విద్య వైజ్ఞానిక ప్రదర్శనల్లో విద్యార్థులు ప్రతిభ చాటేలా చేయడమే కాకుండా వారిని క్రీడల్లోనూ ప్రోత్సహించి రాష్ట్రస్థాయిలో పాఠశాలను మొదటి స్థానంలో నిలిపి అధికారుల మన్ననలు పొందారు.

గోకులం షెడ్ల బిల్లులు ఇవ్వండి



ఎంపీడీవోతో మాట్లాడుతున్న రైతులు

గరుగుబిల్లి, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా ఐదేళ్ల కిందట నిర్మించిన చేపట్టిన గోకులం షెడ్లకు బిల్లులు చెల్లించాలని పిట్టలమెట్ట రైతులు డిమాండ్ చేశారు. బుధవారం పిట్టలమెట్టకు చెందిన రైతులు మంత్రబుడ్డి అప్పలస్వామినాయుడు, అంబటి సత్యం, పుర్రి పోలయ్య, రంభ లక్ష్మంనాయుడు, మరడాన నారాయణరావు తదితరులు ఎంపీడీవో జి.పైడితల్లిని కలిసి తమ సమస్యను వివరించారు. 2018-19లో గోకులం షెడ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. షెడ్ల నిర్మాణం జరుగుతున్న సమయంలో కొంతమేర బిల్లులు చెల్లించారని, మిగిలిన బిల్లుల కోసం ఐదేళ్లుగా తిరుగుతున్నామని వివరించారు. ఇకనైనా బిల్లు ల చెల్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి

జియ్యమ్మవలస, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలు కచ్చితంగా తీసుకోవాలని కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.రజనీ దుర్గ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సామూహిక సీమంతాలు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రావణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

డి.శిర్లాం మాజీ సర్పంచ్ మృతి

మక్కువ రూరల్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.శిర్లాం మాజీ సర్పంచ్ గేదెల జగన్నాథం(70) బుధవారం మృతి చెందారు. కొన్నిరోజుల నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. జగన్నాథం మృతిపై మండలంలోని పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించండి

సాలూరు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాల్లో పూజా మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ బి.అప్పలనాయుడు కోరారు. బుధవారం ఆయన వినాయక నిమజ్జనానికి సంబంధించి ఉత్సవ కమిటీలకు పలు సూచనలు చేశారు. ఈ నెల 6 లోగా నిమజ్జనాలు పూర్తిచేయాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని ముందుగా తెలియజేయాలన్నారు. ఊరేగింపులో బాణా సంచాలు, పేలుడు పదార్థాలు, డీజేలు, అశ్లీల నృత్యాలకు అనుమతి లేదన్నారు.

అయ్యప్పస్వాములకు 55 రోజుల భిక్ష

పార్వతీపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వ మంగళదేవి పీఠం వ్యవస్థాపకుడు మురపాక కాళిదాసు శర్మ అయ్యప్ప స్వాములకు ఉచిత భిక్ష ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అక్టోబరు 5 నుంచి డిసెంబరు 1 వరకూ 55 రోజుల పాటు అయ్యప్పస్వాములకు ఉచితంగా పూజా కార్యక్రమాలకు అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు.

వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

సీతానగరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పెదంకలాం పీహెచ్‌సీ వైద్యాధికారి పెద్దింటి రమ్యసాయి అన్నారు. బుధవారం నీలకంఠాపురంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ జ్వరాలు వస్తున్నాయని గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

గరుగుబిల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. బుధవారం ఉల్లిభద్ర, గొట్టివలస సచివాలయాల పరిధిలోని సిబ్బందికి, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నివాసాలకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించేందుకు స్వమిత్ర సర్వేను నిబంధనల మేరకు నిర్వహించాలన్నారు. అలాగే నిరుద్యోగులకు సంబంధించి కౌశలం సర్వేను నిర్వహించాలన్నారు.నిరుద్యోగ మహిళలకు పలు అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. అర్హత ఉన్నవారికి అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, పి.శిరీష తదితరులు ఉన్నారు.

గండ్లు పూడ్చేదెప్పుడో?





చీకటితోట గెడ్డకు శ్రమదానంతో రైతులు వేసిన గట్టు.. కనపల చెరువు గండి పూడ్చివేత పనులు చేయిస్తున్న నీటి సంఘం అధ్యక్షురాలు

భామిని, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, గెడ్డలకు పడిన గండ్లు పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆయా పరిధిలోని ఆయకట్టుదారులు ఆవేదన చెందుతున్నారు. 15 రోజుల కిందట కురిసిన వర్షాలకు లివిరి సమీపంలో చీకటితోట గెడ్డ గట్టుకు గండిపడింది. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే మరమ్మతులు చేస్తామని హడావుడి చేశారు. రెండు రోజుల తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టడంతో దాన్ని పట్టించుకునే నాథులే కరువయ్యారు. దిగువ పొలాలకు నీరు అందకపోవడంతో రైతులు చందాలు వేసుకుని గండిని తాత్కాలికంగా పూడ్చి సాగునీరు మళ్లించే ఏర్పాట్లు చేసుకున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాల వల్ల కనపల చెరువు గట్టుకు గండి పడింది. చెరువు నీరంతా వృథా అయింది. దాంతో చెరువు దిగువ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇక్కడి చెరువు గండి పూడ్చడం ఎంతో అవసరమని రైతులు అంటున్నారు. అయితే రైతుల సాగునీటి ఇబ్బందుల దృష్ట్యా కనపల చెరువు గండి పూడ్చివేతకు లివిరి సాగునీటి సంఘం అధ్యక్షురాలు సవలాపురపు వరలక్ష్మి చర్యలు చేపట్టారు. ముందస్తుగా ముదుపు పెట్టి చెరువు గండిని పూడ్చిస్తున్నారు. ● ఈ విషయం ఇరిగేషన్ ఏఈ మధు వద్ద ప్రస్తావించగా.. వర్షాల వల్ల మండలంలో సాగునీటి వనరులకు జరిగిన నష్టాలపై అధికారులకు నివేదించామన్నారు. కనపల చెరువు గండి పూడ్చివేతకు అధికారుల అను మతులు తీసుకున్నామన్నారు.

మెదడును ఆరోగ్యంగా ఉంచుకోండి



హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బెలగాం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. దీనికోసం వైద్యుల సూచనలు పాటించాలన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీత్ అయోగ్ ద్వారా హెబిటేషన్ జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌ను జిల్లాకు కేటాయించడం ఆనందదాయకమన్నారు. శరీర ఆరోగ్యంపై ఎంత శ్రద్ధ తీసుకుంటామో బ్రెయిన్ హెల్త్‌పై కూడా అంతే శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ హెల్త్ క్లినిక్‌కు ఒక న్యూరాలజిస్ట్, సైకాలజిస్ట్, నర్స్ వస్తారన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ డా.నాగభూషణరావు, సూపరింటెండెంట్ నాగ శివజ్యోతి, డీఎంహెచ్‌వో డా.భాస్కరరావు, డా.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార సామగ్రి సరఫరా టెండర్ ఖరారు



టెండర్ ప్రక్రియ చేపడుతున్న అధికారులు

పార్వతీపురం/ బెలగాం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన వసతిగృహాలు, గురుకుల పాఠశాలలకు ఆహార సామగ్రి, సౌందర్య సాధనాల కొనుగోలుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పీవో ఆర్.వైశాలి సమక్షంలో బుధవారం నిర్వహించారు. గిరిమిత్ర హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టెండర్లను తెరిచి అతి తక్కువ ధరను ఖరారు చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఆర్.కృష్ణవేణి, జీసీసీ డీఎం, ఐటీడీఏ పారిపాలన అధికారి, ప్రిన్సిపాల్స్, వార్డెన్లు పాల్గొన్నారు.

సాలూరులో నారాయణమూర్తి సందడి



సాలూరులో నారాయణమూర్తి

సాలూరు, సెప్టెంబర్3 (ఆంధ్రజ్యోతి): పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి బుధవారం పట్టణంలో లక్ష్మీ థియేటర్ వద్ద సందడి చేశారు. ఇటీవల విడుదలైన యూని వర్సిటీ పేపర్ లీకేజ్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలన్నారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు పలువురు పోటీపడ్డారు.

పార్వతీపురం రూరల్ సీఐగా రంగనాథం

పార్వతీపురం రూరల్/ బెలగాం సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం రూరల్ సీఐ వి.రంగనాథం బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం సర్కిల్ పరిధిలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాన న్నారు. శాంతిభ ద్రతలను పరిరక్షణకు ప్రాధాన్యమిస్తానన్నారు.

పాలకొండ సీఐగా..

పాలకొండ, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): పాలకొండ సీఐగా ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడి సీఐ చంద్రమౌళి విశాఖ సిటీ సీఐగా బదిలీ అయ్యారు. ప్రసాదరావు ఇదివరకూ విజ యనగరం డీటీసీలో బాధ్యతలు నిర్వర్తించి ఇక్కడకు బదిలీపై రానున్నారు.

వైటీసీలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

సీతంపేట రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైటీసీలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా కంప్యూటర్, ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగవకాశాలు కల్పించనున్నామని వైటీసీ ఇన్‌చార్జి రమణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. వైటీసీ స్కిల్ కళాశాలలో 4 నెలలు ఉచితంగా శిక్షణలు ఇవనున్నామన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తిగల ఇంటర్, డిగ్రీ చదివిన యువత ఈనెల 12లోగా వైటీసీకి నేరుగా దరఖాస్తులను అందజేయాలన్నారు.

రైలులో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కొమరాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి విజయనగరం రైల్వేస్టేషన్ల మధ్య రాయపూర్-విశాఖపట్నం పాసింజర్ రైలులో బుధవారం తనిఖీలు నిర్వహించారు. కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, డ్రోన్, వీడియో గ్రాఫర్, ఈగల్ టీం సంయుక్తంగా దాడులు చేపట్టారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాను అడ్డుకట్ట వేశారు.

కొండెక్కి గిరిజనులకు వైద్యం అందించి..



నడిచి కొండ ఎక్కుతున్న వైద్యసిబ్బంది

సాలూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిశిఖర గ్రామం సిరివరలో జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో వైద్యసిబ్బంది నడిచి కొండెక్కారు. అక్కడి గిరిజనులకు వైద్యసేవలు అందించారు. ఇటీవల వర్షాలు కురవడంతో పాటు రోడ్డు పనులు జరుగుతుండటంతో దారంతా బురదమయం గా మారింది. తోణాం పీహెచ్‌సీకి చెందిన ఎంఎల్‌హెచ్‌పీ అశోక్, ఏఎన్‌ఎం మంగ, హెల్త్ అసిస్టెంట్ రసూల్ తదితరులు బైక్‌లపై బాగుజోల మీదుగా చిలకమెండంగి వరకు వెళ్లారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి కొండెక్కి గ్రామానికి చేరుకుని అక్కడ 120 మంది గిరిజనులకు వైద్యసేవలందించారు. క్షయవ్యాధి, ఇతర వ్యాధులపై అవగాహన కల్పించారు.

కలెక్టర్‌ను కలిసిన బీసీ ప్రతినిధులు

పార్వతీపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధులు బుధవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను బుధవారం కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అధ్యక్షతన సంఘం రాష్ట్ర ప్రతినిధులు కలెక్టరేట్‌లో ఆమన్ని కలిసి పలు విషయాలు మాట్లాడారు. బీసీ విద్యార్థులకు ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలో మంచి మౌలిక వసతులు కల్పించాలన్నారు. సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత పరీక్షలకు కోచింగ్‌లను ప్రారంభించాలన్నారు. జ్యోతీరావుపూలే వి గ్రహాన్ని ఏర్పాటు తదితర అంశాలను కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. జిల్లా స్థాయిలో తమ పరిధిలో అవసరమైన చర్యలకు హామీ ఇచ్చారు.

యూరియా ఇవ్వరా..?



వ్యవసాయాధికారిని ప్రశ్నిస్తున్న ఎంపీపీ

జియ్యమ్మవలస, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పుణ్యకాలం దాటినంతవరకు ఇవ్వరా అంటూ వ్యవసాయాధికారిపై మండిపడ్డారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఎరువులు విషయంపై వాడీవేడీ చర్చ జరిగింది. దీనిపై వ్యవసాయాధికారిణి విజయభారతి సమాధానమిస్తూ మండలానికి వెయ్యి మెట్రిక్ టన్నులు యూరియా కావాలని ఇండెంట్ పెట్టామన్నారు. 510 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. మిగిలిన 490 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. రెండేళ్లుగా తహసీల్దార్ మండల సర్వసభ్య సమావేశానికి రావడం లేదని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్‌పై నోట్ పెట్టాలని ఎంపీడీవో ధర్మారావును ఎంపీపీ సురేష్ ఆదేశించారు. చినమేరంగి ఎంపీపీ స్కూల్ భవనం విద్యాశాఖకు అప్పగించాలని పోలీస్‌శాఖ, కలెక్టర్‌ను ఎంపీపీ కోరారు.

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు



గోతులను పూడ్చిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకడివరం రహదారి మరమ్మతులకు గ్రామస్థులు శ్రమదానం చేశారు. బుధవారం సర్పంచ్ అల్లు అప్పలనాయుడు ఆధ్వర్యంలో గోతులను పూడ్చారు. కొన్నాళ్లుగా రహదారి అధ్వానంగా ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో వరదనీరు చేరింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రహదారికి మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులను స్థానికులు కోరారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్థులు సమష్టిగా కదిలి రోడ్డుపై గుంతలను పూడ్చారు.

ఎమ్‌డబ్ల్యూపీఎస్‌సీ చట్టాన్ని అమలు చేయండి



మాట్లాడుతున్న న్యాయవాది రవికుమార్

పార్వతీపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల పోషణ, సంక్షేమ చట్టం-2007 (ఎమ్‌డబ్ల్యూపీఎస్‌సీ)ను పక్కాగా అమలు చేయాలని హెరిటేజ్ ఫౌండేషన్ న్యాయవాది రవికుమార్ జిల్లా అధికారులకు సూచించారు. బుధవారం ఎమ్‌డబ్ల్యూపీఎస్‌సీ చట్టంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది రవికుమార్ మాట్లాడుతూ ఎమ్‌డబ్ల్యూపీఎస్‌సీ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలను తప్పవని హెచ్చరించారు.

మల్లేశ్‌కు అభినందనలు

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు... ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో పలువురు అభినందనలు తెలిపారు. అరకు పార్లమెంట్ వైస్ చైర్మన్ రెడ్డి కరుణ, పార్వతీపురం నియోజకవర్గ నాయకులు పిన్నింటి జయకృష్ణ ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మండంగి భూషణరావు, సర్పంచ్ పాలక క్రాంతికుమార్, అరకు పార్లమెంట్ కార్యదర్శి రాజా, ఏఎంసీ వైస్ చైర్మన్ గార గౌరీశంకరరావు, కొమరాడ జేఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీకర్, బీజేపీ మండల కన్వీనర్ అప్పలస్వామి, జనసేన నాయకులు రవి, శ్రీను పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న దృశ్యం

భామిని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటి వాటిని సంరక్షించడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అటవీ శాఖాధికారి కేశవరావు అన్నారు. బుధవారం ఐటీసీ-ఎంఎస్‌కె వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలీస్‌కోట ఆదివాసీ గిరిజనులకు పండ్ల మొక్కల పంపిణీ చేశారు. కొండపోడులో మొక్కలు నాటించారు.

కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా స్వామినాయుడు



అభిమానులతో స్వామినాయుడు

మక్కువ రూరల్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): శంబర కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా వేమల స్వామినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రతీ కోఆపరేటివ్ బ్యాంక్‌కు ప్రభుత్వం ముగ్గురు సభ్యులను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శంబర కోఆపరేటివ్ బ్యాంక్‌కు ముగ్గురు సభ్యులను నియమించింది. ఈ సందర్భంగా బ్యాంక్ సభ్యులు బుధవారం శంబరలో సమావేశమయ్యారు. ముగ్గురు సభ్యుల్లో వేమల స్వామినాయుడును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గంజి శ్రీరాం, మద్ది రాములు డైరెక్టర్లుగా, అక్కేన శ్రీనును సెక్రటరీగా ఎన్నుకున్నారు. శంబర గ్రామ పెద్దలు, పోలమాంబ దేవాలయం మాజీ చైర్మన్ గంజి కాశినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొట్టాపు కృష్ణ, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి నైదాన సూర్య యాదవ్, టీడీపీ నాయకులు వేమల లక్షణరావు, చిన్నారావు, నైదాన తిరుపతిరావు, శంబర ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు తదితరులు స్వామినాయుడును అభినందించారు.

8 దోబీఖానాల మంజూరు

మక్కువ రూరల్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 8 గ్రామాల్లో రజకులకు దోబీఖానాలు మంజూరయ్యాయి. కోన, తూరుమామిడి, మక్కువ, చెముడు, కవిరిపల్లి, కన్నంపేట, కాశీపట్నం గ్రామాల్లో దోబీఖానాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గానూ ఒక్కో దోబీఖానాకు రూ.10లక్షలు చొప్పున మంజూరయ్యాయి. అలాగే శంబరలో గతంలో నిర్మించిన దోబీఖానా మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు గానూ ఉపాధి హామీ నిధులను వెచ్చించనున్నారు. రజకుల దోబీఖానాల నిర్మాణానికి స్థలాలను కేటాయిస్తామని మక్కువ తహసీల్దార్ కె.భరత్‌కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ పట్టణ ఏఈ దివ్య ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ పార్వతీపురం సబ్ స్టేషన్‌లోని 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలోని బెలగాంతో పాటు పట్టణం ప్రధాన రహదారితో పాటు 30 వీధులకు సంబంధించి విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏఈ వెల్లడించారు.

డ్రోన్లతో ఎరువుల పిచికారీ మేలు

సాలూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంటలకు డ్రోన్ల ద్వారా ఎరువులను పిచికారీ చేసే మేలు జరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాసరాజు, అమృత వీణ, ఏవో శిరీష అన్నారు. ముంగివానివలస, గుడ్డంగివలసల్లో బుధవారం రైతులకు ఎరువుల వాడకంపై వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష భాను తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి విద్యుదాఘాతం

కొమరాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్తాం గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల డొల్లు రోహిత్ ఆడుకుంటూ విద్యుత్ హెవీ లైన్‌ను బుధవారం పొరపాటున తాకాడు. దాంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి చేయి కాలింది. బాలుడికి ప్రాణాపాయం తప్పింది. బాలుడిని ఆసుపత్రిలో చేర్చారు.